# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 27-06-2025 సమయం : సాయంకాలం 6 గం. 10 ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ పర్యాటక రంగం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు.
- ❖ రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు.
- ❖ కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోతాయన్నది అపోహ మాత్రమే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు.
- ❖ అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి వెల్లడించారు.
- ❖ వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ శాఖ పేర్కొంది.

==============================

పర్యాటక రంగం అభివృద్ధితో ఉపాధి అవకాశాలు విస్తృతం అవుతాయని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. విజయవాడలో ఈ రోజు ఏర్పాటు చేసిన జీఎఫ్ఎస్టీ పర్యాటక సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యటక క్యారవాన్లను ప్రారంభించారు. అనంతరం జరిగిన సభలో ముఖ్యమంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో అనేక పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని గుర్తు చేశారు. విశాలమైన సముద్ర తీరంతో పాటు, అటవీ ప్రాంతం ఉందని చెప్పారు. అలాగే, పాపికొండలు, కోనసీమ, హార్సిలీహిల్స్‌ను మరింత అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి పేర్కొంటూ..

(వాయిస్ 35 సెకన్లు)

==============================

విశాఖ ఉక్కు కర్మాగారంలో 3వ బ్లాస్ట్ ఫర్నేస్ ను ఉక్కు శాఖ సెక్రటరీ దయానిదాన్ పాండే, సంస్థ ఇన్ ఛార్జ్ చైర్మన్ ఏకే సక్సేనా ఈ రోజు పునఃప్రారంభించారు. ప్రస్తుతం కొనసాగుతున్న రెండు బ్లాస్ట్ ఫర్నేస్ లతో కలిపి ఉక్కు కర్మాగారం రోజుకు సుమారు 21 వేల టన్నుల హాట్ మెటల్ ఉత్పత్తి చేసే సామర్థ్యాన్ని సాధిస్తోందని ఈ సందర్భంగా అధికారులు తెలిపారు. ఉత్పత్తి సామర్థ్యాన్ని గణనీయంగా పెంచడంతో సంస్థ ఈ సంవత్సరం మార్చి నుంచి మే వరకూ నిర్వహణ లాభాలను సాధించిందని పేర్కొన్నారు.

===============================

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ ఇల్లు నిర్మించి ఇవ్వాలన్నది ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. అనకాపల్లి జిల్లా సబ్బవరం మండలంలోని పైడివాడ అగ్రహారం గృహనిర్మాణ లే అవుట్ ను మంత్రి ఈ రోజు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు, పట్టణా ప్రాంతంలో 2 సెంట్లు చొప్పున ఇళ్ళ స్థలాలను ఇస్తామని మంత్రి తెలిపారు. వివక్షకు తావు లేకుండా గృహనిర్మాణ పథకం అమలు చేస్తామని వెల్లడించారు. అలాగే నాణ్యత విషయంలో రాజీ పడకుండా పనులు చేపడతామని కొలుసు పార్థసారథి పేర్కొంటూ...

(వాయిస్ 35 సెకన్లు)

===============================

కృత్రిమ మేధ (ఏఐ)తో ఉద్యోగాలు పోతాయన్నది అపోహ మాత్రమే అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పోలీస్ శాఖలో కృత్రిమ మేధ వినియోగం మీద గుంటూరులో నిర్వహిస్తున్న మూడు రోజుల పోలీస్ ఎఐ హ్యాకథాన్ కార్యక్రమాన్ని ఆయన ఈ రోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... కృత్రిమ మేధతో ప్రపంచ వ్యాప్తంగా తెలుగు వారి ప్రతిభ చాటాలని ఆకాంక్షించారు. శాంతి భద్రతలు ఉన్న చోటనే అభివృద్ధి సాధ్యపడుతుందని అన్నారు. సాంకేతికతతో నేరాలను మరింత సమర్థంగా అదుపు చేయవచ్చునని ముఖ్యమంత్రి చెప్పారు. కాగా, కృత్రిమ మేధను పోలీస్ శాఖలోనూ వినియోగించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

===============================

రాష్ట్ర వ్యాప్తంగా జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు ఈ రోజు నిర్వహిస్తున్నారు. విశాఖపట్నంలో 193 ఏళ్ళ పురాతన జగన్నాధ స్వామి వారి ఆలయం నుంచి రథయాత్ర ఈ రోజు నిర్వహించారు. అదే విధంగా విజయవాడతో పాటు పలు ప్రధాన నగరాలలో కూడా రథయాత్ర వైభవంగా జరుగుతోంది. ఒడిషాలోని ప్రఖ్యాత పూరీ క్షేత్రంలో జగన్నాథ రథయాత్ర నిర్వహిస్తున్నారు. పూరీ నగరవీధులు ప్రపంచం నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో నిండిపోయాయి.

విరామం

===============================

రాష్ట్రంలో చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందిస్తోందని సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. తిరుపతిలో 130 మంది యువ పారిశ్రామికవేత్తలతో పరిశ్రమల ఏర్పాటుకు ఎంఎస్ఎంఈల ద్వారా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... ఎంతో మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తున్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశ్రామిక వేత్తలకు సబ్సిడీ కింద ఎన్నో పథకాలను అందిస్తున్నాయని తెలియచేస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

===============================

ప్రసార భారతి సౌత్ జోన్ పరిధిలో ఒప్పంద ప్రాతిపదికన పని చేసేందుకు అర్హులైన అభ్యర్థుల నుండి దరాఖాస్తులను ఆహ్వానిస్తునట్లుగా ఒక ప్రకటన విడుదల చేసింది. ఎంపిక అయిన వారు టెక్నికల్ ఇంటెర్న్స్ గా పూర్తి స్థాయి కాంట్రాక్ట్ విధానంలో ఆకాశవాణి, దూరదర్శన్ కేంద్రాల్లో పని చేయాల్సి ఉంటుంది. ఏడాది పాటు కాంట్రాక్ట్ విధానంలో ఈ పోస్టులకు ఎంపిక చేస్తారు. అభ్యర్థులు 30 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలి. ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, లేదా మాస్టర్ డిగ్రీ లేదా తస్సమాన విద్యను అభ్యసించి ఉండాలి. 2024-25 సంవత్సరానికి డిగ్రీ పూర్తి చేసిన వారు ఈ పోస్టులకు అర్హులని ఆ ప్రకటనలో పేర్కొంది.

==============================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్.. మనసులోని మాట” కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈరోజు సాయంత్రం వరకు పంపవచ్చు.

==============================

ఉమ్మడి కర్నూల్ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం శ్రీశైలంలో శ్రీ మల్లికార్జున స్వామి వారి ఉచిత స్పర్శ దర్శనాన్ని జూలై ఒకటో తేదీ నుంచి పునరుద్ధరిస్తున్నామని ఆలయ అధికారులు తెలిపారు. జ్యోతిర్లింగాలలో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రంలో కొలువుదీరిన శ్రీ మల్లికార్జునస్వామిని భక్తులు తమ చేతులతో తాకుతూ స్పర్శ దర్శనం చేసుకొనే సంప్రదాయం దశాబ్దాలుగా కొనసాగుతోంది. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతుండటంతో సామాన్యులకు స్వామి దర్శనం కల్పించాలన్న ఉద్దేశంతో ఆరు నెలల క్రితం ఉచిత సర్శ దర్శనాన్నీ నిలుపుదల చేస్తూ ఆలయ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

==============================

టిడ్కో ఇళ్లకు సంబంధించిన పెండింగ్ పనులను పూర్తి చేసి దీపావళి నాటికి లబ్ధిదారులకు అందిస్తామని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి.నారాయణ తెలిపారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో ఈ రోజు ఒంగోలు అర్బన్ డెవలప్మెంట్ అథారిటీపై నిర్వహించి సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు.

==============================

నైరుతి రుతుపవనాలకు తోడు, వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో వచ్చే మూడు రోజులు వర్షాలు కురుస్తాయని అమరావతిలోని వాతావరణ శాఖ పేర్కొంది. ఆ వివరాలను వాతావరణ శాఖ అధికారిణి తెలియచేస్తూ…

(వాయిస్ 32 సెకన్లు)

==============================
==============================